## మున్నుడి

శ్రీ రామచంద్రమూర్తి స్వయంగా శ్రీమన్నారాయణుడు. వైకుంఠం నుండి దిగివచ్చి తన పరివారంతో సహామానవుడిగా 'పుట్టి', రావణాది దానవులను మట్టు బెట్టి, ధర్మాన్ని నిలబెట్టి, శరణార్థులను వెన్నుదట్టి, ఆశ్రితులకు ఆటపట్టయినాడు. ఆయనను కీర్తించాలంటే అన్నమయ్య కీర్తనను మించిన సులువైన దారేలేదు. ఈ కీర్తన శ్రీ రాముడు తన జీవనకాలంలో ఎవరెవర్ని ఏవిధంగా కరుణించింది అలవోకగా వర్ణిస్తున్నారు. ఆయన ఆత్మబంధువై, ఎవరెవరికి ఏమె కరుణించాడో వినండి...

**ఆవె ॥ రామచంద్రుడొకడె రమణీయ గుణరాశి**
**పలువురికిని 'ఆత్మబంధు' వాయె**
**అన్నమయ్య వివరమందించె వినుడహో!!**
**దాశరథిగ వేంకటేశు దలచె.**

**రాగం : ద్విజావంతి**

రామచంద్రుడితడు రఘువీరుడు
కామితఫలములియ్య గలిగె నిందరికి ॥రామచంద్రు॥

గౌతము భార్యపాలిట కామధేనువితడు
ఘాతల కౌశికు పాలిటి కల్పవృక్షము
సీతాదేవి పాలిట చింతామణి యితడు
ఈతడు దాసులపాలి ఇహపరదైవము ॥రామచంద్రు॥

పరగ సుగ్రీవుపాలి పరమ బంధుడితడు
సరి హనుమంతుపాలి సామ్రాజ్యము
నిరతి విభీషణుని పాలి నిధానము యీతడు
గరిమ జనకు పాలి ఘనపారిజాతము ॥రామచంద్రు॥

తలప శబరిపాలి తత్తపు రహస్యము
అలరి గుహుని పాలి ఆదిమూలము
కలడన్న వారిపాలి కన్నులెదుటి మూరితి
వెలయ శ్రీ వేంకటాద్రి విభుడీతడు ॥రామచంద్రు॥



Scanned with CamScanner

04.07.2020



భావామృతం :

ఈ శ్రీ రామచంద్రమూర్తి రఘుకులమున పుట్టిన వీరాగ్రణి. ఈ మహానుభావుడు ఇంతమందికి వారు వారు కోరిన కోర్కెలను దీర్చినాడు. ఆ వివరములు వినండి.

(దేవదానవులు పాలసముద్రమును చిలికిన సమయంలో ఉద్భవించిన శ్రీ మహాలక్ష్మిని శ్రీ హరి చేబట్టగా మిగిలినవి చాలా వరకు ఇంద్రుని పరం చేశాడు శ్రీ మన్నారాయణుడు. అవి ఆ ఇంద్రునికి మేలే చేశాయో లేక అసూయాగ్రస్థులైన దానవులచే కష్టల్నే తెప్పించాయో చెప్పలేము గాని ఈ శ్రీ రామచంద్రుడు ఆ దివ్యమైన ఐశ్వర్యాలకన్నా అధికమైన మేళ్ళను చేశాడు.)

ఈ శ్రీ రామచంద్రుడు గౌతముని భార్యఅయిన అహల్యను శాపవిముక్తురాలను చేసి ఆమె పాలిటి కామధేనువైనాడు. ఘూతలు (బాణములు లేక అస్త్రములు) స్వీకరించి విశ్వామిత్రునికి గురువుపదవిని అందించిన కల్పవృక్షము. (ఆయన చెప్పినట్లే చేసి ఆఖరికి తన భక్తుడైన యమాతిని కూడ వధిస్తానన్నాడు). సీతాదేవి పాలిటి 'చింతామణి' అనే ఐశ్వర్యప్రదాయకమైన దివ్యమణి వంటివాడు. రామదాసులందరికి ఈయన ఇహలోకంలో కోరికలను పరలోకంలో మోక్షమును ప్రసాదించిన దైవమూర్తి.

సుగ్రీవుడు పోగొట్టుకొన్నవన్నీ తిరిగి లభింపచేసిన పరమ బంధువు. హనుమంతుడికి ఈయన సామ్రాజ్యము వంటివాడు. విభీషణునికి ఆసక్తితో దాచిబెట్టిన 'పాతర' వంటి ధనము ఈ శ్రీరాముడే. మామగారైన జనకమహారాజునకు ఘనమైన మహిమ (ఎన్నటికీవాడిపోదు) గల పారిజతవృక్షము. (జానకి చేబట్టి శాశ్వతంగా జనకుని పేరు చిరస్థాయిగా వుంచాడు)

శబరి ఎంగిలిపండ్లుతని పరమాత్మకు జాతి భేదముండదన్న తత్త్వరహస్యాని చాటిచెప్పినవాడు. నావ నడిపించుకొని, అందరి బ్రతుకుల్ని ఒడ్డున చేర్చేవాడినే (ఆదిమూలమునే) ఒడ్డున చేర్చిన ఖ్యాతినిచ్చాడు. కలదు కలండనెడి వారికి (కలడోలేడో అనే సందేహం కలిగినా) కలనని నిరూపించిన వాడు. శ్రీ వేంకటాద్రి మీద విభుడు వేంకన్న రూపంలో వున్న శ్రీ రామచంద్రమూర్తి.



Scanned with CamScanner